## మహిళా సాధికారతకు ఉపాధి కీలకం : సబ్ కలెక్టర్ ఉమాహారతి

**నారాయణఖేడ్, మార్చి 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యం లో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని నారాయణఖేడ్ డివిజన్ సబ్ కలెక్టర్ ఉమాహారతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారతకు ఉపాధి కీలకమన్నారు. కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధిని పొందడమే కాకుండా ఆర్థికంగా స్వావలంబన సాధించగలరని తెలి పారు. జిల్లా సంక్షేమ అధికారిణి కె.లలితకుమారి మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సాధికారత కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరచడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎన్.సుజాత, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, బాలసదనం సూపరిం టెండెంట్ విజయ, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, శిక్షణ కేంద్రం సిబ్బంది మరియు స్థానిక మహిళలు, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త:** సంగారెడ్డిలోని రామ్‌మందిరంలో జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు త్వరగా దర్శనంఅయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని, అలాగే వారికి ముత్యాల తలంబ్రాలు అందిస్తామని నిర్వాహకులు తెలి పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దర్శనం ఆలస్యం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.


పోలీసులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

# టిబి రహిత జిల్లాయే లక్ష్యం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 24, ప్రభాతవార్త**

సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా '100 డేస్ టిబి ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టిబివ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'టిబి ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రజలు సక్రమంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో అవగాహన పెంచడం ద్వారా టిబి నివారణ సాధ్యమని తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పెద్దఎత్తున పాల్గొని టీబీ నివారణపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొన్న రాజేందర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వసంత్ రావు, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ అరుణకుమారి, వైద్య సిబ్బంది, కళాశాలల విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


'100 డేస్ టిబి ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**గుమ్మడిదల పిహెచ్‌సిని సందర్శించిన కలెక్టర్...**

**గుమ్మడిదల మార్చి 24 ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవీణ్య మంగళవారం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పిహెచ్‌సీ) సందర్శించారు. ఈ సందర్భంగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు విధానంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అందిస్తున్న సేవలపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా ఓపీ రిజిస్ట్రేషన్, ల్యాబ్ పరీక్షలు, మందుల పంపిణీ వంటి సేవలకు సంబంధించిన వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసే విధానాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించారు. సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగ నిర్మల, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్, ఎమ్మార్వో పరమేష్, ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**రైతుల ఆధునిక మెలుకువలు నేర్చుకొని అధిక లాభం అర్జించాలి**

**గుమ్మడిదల మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో వర్షాధారిత అభివృద్ధి పథకం అమలును పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కూర్మ కొమురయ్య కూరగాయల పొలాన్ని సందర్శించి, పథకం కింద అందించిన పరికరాల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ప్లాస్టిక్‌క్రేట్స్, వర్మీ బెడ్స్, తేనెటీగల పెంపక బాక్సులను సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులను అనుసరించడంద్వారా అధిక దిగుబడులు, లాభాలు సాధించవచ్చని తెలిపారు. అలాగే రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకుని సమిష్టిగా పంటలను మార్కెటింగ్ చేయడం, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమన్వయంతో వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి పి. సోమేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ అధికారి ఉమరాణి, మండల తహసిల్దార్ పరమేశం, ఉద్యాన అధికారులు మోనిక, అనూష, వ్యవసాయ అధికారి, హెచ్‌ఈఓస్ విట్టల్, స్వామి, ఏఈ హౌసింగ్, సర్పంచ్ రాణి సురేష్, గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిపిటిఎఫ్ నాయకులు

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత కరువు

### టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 24, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాముఖ్యత లేకుండాపోయిందని, విదారంగం నిర్లక్ష్యానికి గురవుతుందని టిపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు వై అశోక్‌కుమార్ అన్నారు. టీపీటీఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్వాతంత్యం నాటి నినాదం అందరికీ విద్య, వైద్యం అందకుండా పోతుందని, ఏ ప్రభుత్వ చరిత్ర చూసిన బడ్జెట్‌లో కేటాయింపులు విద్యాభివృద్ధికి దోహదపడటం లేదు. ప్రభుత్వాల మాటలే కానీ చేతల్లో విద్యకు ప్రాధాన్యత కరువయ్యిందని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్యయాదవ్ మాట్లాడుతూ 20 శాతం నిధులు కేటాయించాలని విద్యావేత్తలు, ఉపాధ్యాయ లోకం కోరుకుంటుందని అన్నారుజిల్లా అధ్యక్షులు సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభత్వ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యా శాఖకు 64 వేల కోట్లు కేటాయించాల్సిందిపోయి 26,674 కోట్లు కేటాయించడం ప్రభుత్వ సవతి ప్రేమ కనపడుతుందని అన్నారు. ఈ నిరసనలో సంజీవయ్య, అశోక్ కుమార్, బాణోత్ రవీందర్, విజయ్ భాస్కర్, భాస్కర్, వెంకటరాజయ్య, మల్లికార్జున్, మాధురి, వాసవి, వసంత, సంధ్య, హిమబిందు, ఆదిరాజ్, చంద్రమోహన్, నర్సింలు, కరోద్దీన్, మేకల శ్రీనివాస్, రాంతీర్థ్ నర్సింలు, సంతోష్ కుమార్, శివశంకర్, యాదగిరి, రవీందర్, సురేష్, సిద్దేశ్వర్, పుండరీకం, రాజశేఖర్, నీలి లక్ష్మన్, ఆనందం, వాసీమ్, గోవర్ధన్, ఫారూఖ్, సర్ఫరాజ్, చంద్రమోహన్, రాంచందర్, శ్రీకాంత్, సంగారెడ్డి, సామెల్, మల్లప్ప పాల్గొన్నారు.

## గజ్వేల్ ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

**గజ్వేల్‌టౌన్, మార్చి 24 (ప్రభాతవార్త):** పట్టణంలోని జిడిఆర్, సాయి జిడిఆర్ పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న గజ్వేల్ ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి యుఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమానత్వం, పారదర్శకత, న్యాయం ఉండాల్సిన సమయంలో అధికారులే ఒక వర్గానికి మద్దతు ఇవ్వడం విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యా ప్రమాణాలు, ఫీజు నియంత్రణ నిబంధనలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అవి పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేయడం, తగిన మౌలిక వసతులు లేకపోయినా పాఠశాలలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గజ్వేల్ ఎంఈవో ఈ సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గజ్వేల్ ప్రాంతంలో విద్యా వ్యవస్థను పారదర్శకంగా, న్యాయంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాచారం శేఖర్, గుడికందుల రవి తదితరులు పాల్గొన్నారు.


డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతున్న యుఎస్‌ఎఫ్ఐ నాయకులు

## పన్యాలలో ఇసుక అక్రమ నిల్వలు సీజ్

**హత్నూర మార్చి 24, ప్రభాతవార్త :** హత్నూర మండలం పన్యాల గ్రామం పరిధిలో అక్రమంగా నిల్వచేసిన పెద్ద ఎత్తున నిలువచేసిన ఇసుక దంపులను రెవెన్యూ పోలీసు సంయుక్త బృందం మంగళవారం సీజ్ చేశారు. గ్రామ సమీపంలోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తీసి నిల్వలు చేశారని ఫిర్యాదు రావడంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాహుల్, జిపిఓ లు సాయి, రమేష్, పోలీసు సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. 35 ఇసుక కుప్పలను సీజ్ చేశామని సుమారు 170 టిప్పర్ల వరకు ఇసుక ఉంటుందని ఆర్ఐ రాహుల్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని శాలిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి జశ్వంత్, రాకేష్, అజయ్ ద్విచక్రవాహనంపై రామాయంపేట వైపునకు వెళ్తుండగా గ్రామశివారులో ఎదురుగా వచ్చిన బోలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

**న్యాల్‌కల్, మార్చి 24, ప్రభాతవార్త:**

ఇసుకును అక్రమంగా తరలి స్తున్న లారీని (టిఎస్ 05 7327) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... జహీరాబాద్ నుంచి కర్ణాటకలోని బీదర్ వైపు వెళుతున్న లారీని పరిశీలించగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీసు ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు.


పోలీసు ఠాణాకు తరలిస్తున్న ఇసుకను లారీ

### భూ భారతి దరఖాస్తులు పరిష్కరించడంలో
## తహసీల్దార్లకు చిత్తశుద్ధి అవసరం
### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, మార్చి 24, ప్రభాతవార్త :** మెదక్ జిల్లాలో భూభారతి దరఖాస్తులు పరిష్కరించడానికి తహసీల్దారులకు చిత్తశుద్ధి అవసరమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుండి భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ జాబితా తయారీ, ఇతర రెవెన్యూ సమస్యలపై గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడంలో తహసీల్దారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత పాలన కోసం అధికారులు పాటుపడాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించడంలో అలసత్వంవహిస్తే శాఖపరమైన చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. మండలాలవారీగా భూభారతి, ప్రజావాణి ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో వాటన్నింటినీ పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. ఓటర్ జాబితా తయారీ అన్ని శాఖల సమన్వయం చేసుకొని త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సొంత నిర్ణయాలకు తావులేదన్నారు. గూగుల్ మీట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి
## న్యాయవాదుల సహకారం అవసరం
### జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవాని చంద్ర

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 24, ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి న్యాయవాదులు కృషిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.భవానిచంద్ర పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా, మంగళవారం సంగారెడ్డి కోర్టులో న్యాయవాదులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర మాట్లాడుతూ, రాజీ చేయదగిన పోలీస్ కేసులు, భార్యాభర్తల మధ్య చిన్నచిన్న వివాదాలు, ఎక్సైజ్, బ్యాంక్ తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. చిన్న చిన్న వివాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవడం కంటే, ఇరువర్గాలు పరస్పర రాజీతో సమస్యలను పరిష్కరించుకొని సామరస్యంగా జీవించాలని సూచించారు. అదే విధంగా, న్యాయవాదులు తమ సహకారం అందించి లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడంతో పాటు, కక్షిదారులకు తగిన నష్టపరిహారం లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి డి.వి.ఆర్.తేజో కార్తీక్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహేశ్, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

### నష్టపరిహారం అందించకపోతే....
## బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వం


మెదక్ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న భూనిర్వాసితులు

**రామాయంపేట, మార్చి 24, ప్రభాతవార్త:** పట్టణ పరిధిలో నిర్మాణంలో ఉన్న మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి 765 డిజి బైపాస్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని మంగళవారం భూనిర్వాసితులు మెదక్ ఆర్డీవో రమాదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం జారీ చేసిన నోటీసుల ప్రకారం తమకు సరైన నష్టపరిహారం చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2022 సంవత్సరంలోని రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా మూడొంతులుగా నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మెదక్ రహదారిలో రూ.7000, హైదరాబాద్ రహదారిలో రూ. 5000 రిజిస్ట్రేషన్ విలువ ఉన్నందున, దానికి తగిన విధంగా మూడింతల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సరైన నష్టపరిహారం అందించకపోతే బైపాస్ రోడ్డుకు తమ భూములను ఇవ్వబోమని భూనిర్వాసితులు స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో భూ నిర్వాసితులు దోమకొండ రాములు, ఎర్రం నాగరాజు, దోమకొండ వెంకటేష్ ఉన్నారు.

### కెవిపిఎస్ డైరీని ఆవిష్కరించిన ఎసిపి

**గజ్వేల్ టౌన్, మార్చి 24 (ప్రభాతవార్త):** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డైరీని గజ్వేల్ ఏసిపి నర్సింలు మంగళవారం కెవిపిఎస్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు పొట్టోల్ల దాసు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి నర్సింలు మాట్లాడుతూ సామాజిక కుల వివక్షత ఉద్యమాలలో కెవిపిఎస్ ముందంజలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు గీసు మల్లేశం, బలిపురం రాజు పాల్గొన్నారు.



కెవిపిఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న ఏసిపి నర్సింలు



సామూహిక వందేమాతర గేయాలాపన చేస్తున్న దృశ్యం

## భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం వందేమాతరం

**సిద్దిపేట రూరల్, మార్చి 24,ప్రభాతవార్త :** భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం వందేమాతరం అని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సాయిని విజయభారతి, ఎబివిపి జాతీయ కార్యదర్శి శ్రవణ్ బిరాజ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఎబివిపి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక వందేమాతర గేయాలాపనలో వారు పాల్గొని మాట్లాడారు. వందేమాతరం 150 చారిత్రక ఘట్టానికి మనం సాక్షులుగా నిలిచామన్నారు. 1947లో వందేమతర గేయం దేశానికి స్వాతంత్ర్యం ఇప్పించిందన్నారు. వందేమాతం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం కాదన్నారు. పరాయి పాలనలో ఉన్న భారతీయుల్లో వందేమాతం గేయం ఎన్నో ఆశలు నింపిందన్నారు. బంకించంద్ర ఛటర్జీ భారతీయుల శక్తిని తెలియజేసేలా గీతాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సునీత, ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య,రాష్ట్ర వనవాసి కో కన్వీనర్, సిద్దిపేట నగర కార్యదర్శి పరుశురాం, ప్రాంత హాస్టల్స్ కో-కన్వీనర్ పవన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్, విద్యార్థులు, ఆధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### రాత్రి 9 గంటలకు బస్సు ప్రారంభం

**హుస్నాబాద్ రూరల్, మార్చి 24, ప్రభాతవార్త :** ప్రయాణికుల కోరిక మేరకు హన్మకొండ నుండి హుస్నాబాద్‌కు రాత్రి 9 గంటలకు ప్రత్యేక బస్సు సేవను ప్రారంభించినట్లు హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఇప్పటికే నడుస్తున్నందున ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కరీంనగర్ హుస్నాబాద్‌కు నుండి రాత్రి 10 గంటలకు, సిద్దిపేట నుండి రాత్రి 9.30 గంటలకు హుస్నాబాద్‌కు చివరి బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 20 రోజుల క్రితం హుస్నాబాద్ నుండి ఆదిలాబాద్‌కు మూడు బస్సు సర్వీసులు ప్రారంభించామని, హుస్నాబాద్ నుండి ఆదిలాబాద్‌కు ఉదయం 8.20 గంటలకు, మధ్యాహ్నం 1.10 గంటలకు, మధ్యాహ్నం 3.30 గంటలకు, ఆదిలాబాద్ నుండి హుస్నాబాద్‌కు ఉదయం 5.30గంటలకు, 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఇవే కాకుండా గతంలో హుస్నాబాద్ నుండి భద్రాచలంకు ఒక నైట్ సర్వీస్ మాత్రమే ఉండగా, ప్రస్తుతం అదనంగా ఉదయం 5 గంటలకు మరో బస్సు సర్వీస్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.


సింగూరు ప్రాజెక్టు వద్ద ఆక్టోపస్ మాక్ డ్రిల్ చేస్తున్న దృశ్యం

## సింగూరు ప్రాజెక్టు వద్ద అక్టోపస్ మాక్ డ్రిల్

**పుల్‌కల్, మార్చి 24, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద టెర్రరిస్టుల దాడులను ఎదుర్కోవడంలో దిట్టగా పేరు పొందిన ఆక్టోపస్ పోలీసులు మంగళవారం ఆక్టోపస్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద చర్యలను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు దళం ప్రాజెక్టు వద్ద నిర్మించిన జల విద్యుత్ కేంద్రం, ప్రాజెక్టు ఆనకట్ట పరిసరాల వద్ద మాక్డ్రిల్ చేపట్టారు. విద్యుత్ కేంద్రంలోకి వెళ్లి పరిసరాలపై సమగ్రంగా పరిశీలించారు. టెర్రరిస్టులు బాంబులు, ఇతరాత్ర పేలుడు పదార్థాలను అమర్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే సమయంలో వాటిని ఎలా నిర్వీర్యం చేయాలో అవగాహన కల్పించారు. టెర్రిస్టుల దాడులు, బాంబు బెదిరింపులు, హైజాక్ లాంటి అత్యవసరర పరిస్థితులను సమర్థవంతంగా నియంత్రించేందుకు దళం పని చేస్తుందని ఆక్టోపస్ డిఎస్పీ అనిల్ తెలిపారు. అధునాతన ఆయుధాలు, సాంకేతిక పరికరాలు ఉపయోగించి ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్ల లాంటి కీలక ప్రాంతాల్లో భద్రతను బలోపేతం చేయడం ఆక్టోపస్ పని అని గుర్తు చేశారు. బాంబు నిర్వీర్యం చేసేందుకు ఆక్టోపస్ దళంలో ప్రత్యేకంగా బాంబ్ డిస్పోజల్ యూనిట్ ఉంటుందన్నారు. రోబోటిక్ పరికరాలు, ఎక్స్రే యంత్రాలు ఉపయోగించి బాంబులో ఉన్న భాగాలను విశ్లేషిస్తారని తెలిపారు. సరైన పద్ధతుల్లో వైర్లు కట్ చేయడం, నియంత్రిత పేలుడు ద్వారా బాంబును నిర్వీర్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రక్రియలో నిపుణులు మాత్రమే పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జోగిపేట సిఐ అనిల్‌కుమార్, ఎస్ఐ నల్లా విశ్వజన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

### ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీశ్రావ్య

**పెద్దశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త :** బ్యాంకర్లు నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆర్బీఐ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీశ్రావ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాలకు చెందిన పలు బ్యాంకర్లతోపాటు ఐకెపి సిబ్బంది. వ్యవసాయ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. యువతకు, మహిళలకు, రైతులకు, ప్రజలకు సంభదించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, ఇతర రుణాలను అందించాలని సూచించారు. రుణాల మంజూరుతోపాటు రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్డీఎం బాపూజీ, ఎంపీడీఓ క్రాంతికుమార్, ఎస్బీఐ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశం, ఏఓలు కృష్ణ, రాజేశ్, ఏపియంలు, సీసీలు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు త్వరగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సిద్దిపవేట జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె.హైమావతి సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంపై చర్చించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతంగా జరగాలంటే తప్పనిసరిగా రాజకీయ పార్టీల బూత్‌లెవెల్ ఏజెంట్లు, ఎన్నికల బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 2002 ఓటర్ జాబితా 2025 ఓటర్ జాబితా సరిపోల్చుకొని ఓటర్ జాబితాలో తీసివేతలు, కొత్త ఓటర్ నమోదుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అభ్యర్థన మేరకు బూత్ లెవెల్ ఏజెంట్లకు, బూత్ లెవెల్ అధికారులకు శాసనసభ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక ఓటర్ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఆర్ఎస్ మోహన్‌లాల్, బిజెపి బైరి శంకర్, కాంగ్రెస్ అనిల్‌కుమార్, ఎఐఎంఐఎం మునీర్, కలెక్టరేట్ ఎలక్షన్స్ సూపరింటెండెంట్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## సీతారాముల కళ్యాణానికి హాజరుకండి

**-ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ఆహ్వానించిన ఆలయ కమిటీసభ్యులు**



ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, మార్చి 24, ప్రభాతవార్త:**
శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీకోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 25 నుండి 29 వరకు నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి, ఉత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా గణపతి పూజ, కళ్యాణం, అన్నప్రసాద వితరణ, స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు నరసింహచార్యులు, పూజారులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో వైభవంగా బండ్ల ఊరేగింపు..



బండ్లు ఊరేగిస్తున్న భక్తులు

**చిలిపిచెడ్, మార్చి 24, ప్రభాతవార్త:**
చిలిపిచేడ్ మండలం జగ్గంపేటలోని శ్రీనల్లపోచమ్మ జాతరలో రెండవ రోజు ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఆనవాయితీగా తిరిగే బండ్లు ఒక దాని వెనక మరొకటి వరుసగా కదిలాయి. ప్రజలు బండిని అందంగా ముస్తాబుచేసుకొని అమ్మవారిదగ్గరకు డప్పుచప్పుళ్లతో తీసుకొచ్చి, పనిబాటల వారు సంప్రదాయబద్ధంగా బండికి పూజలు నిర్వహించి, బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బండ్లను సుందరంగా తీర్చిదిద్ది, పోతు రాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్ల మధ్య యువత చిందులు వేస్తూ బండ్లు ఊరేగించారు. చుట్టు ప్రక్కన గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని ఊరేగింపు కార్యక్రమాన్ని చూసి తరించారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్

**నర్సాపూర్ మార్చి 24, ప్రభాతవార్త.**
నర్సాపూర్‌లో బార్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జి.శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా ఉపాధ్యక్షులుగా ఎ.ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.నాగరాజ్, ట్రెజరరీ అండ్ లైబ్రేరియన్ ఎస్.మధుశ్రీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆక్టివిటీస్ పి.సుధా కర్, మహిళ రిప్రజెంటేటివ్‌గా సిహెచ్.స్వరూపరాణిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా ఎండి.ఇక్బాల్ అలీ జాఫర్, ఎండి కాజా మహిముద్దీన్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, కె.ప్రకాష్, డి.శ్రీధర్‌రెడ్డిలను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

**మనూర్, మార్చి 24, ప్రభాతవార్త:**
గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారిణి లలితాదేవి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని బోరంచలో అంగన్‌వాడీ టీచర్లతో లలితాదేవి ప్రత్యేకంగా సమావేశం అయి టీచర్లకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, టీచర్లు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత, సూపర్‌వైజర్ జమున, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.12.30లక్షలు పలికిన తైబజార్




తైబజారు వేలం పాటలో దక్కించుకున్న దత్తు

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం సర్పంచి కంజర్ల చంద్రశేఖర్, ఈవో ప్రదీప్ ఆధ్వర్యంలో వారాంతపు సంత వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో పలువురు వ్యాపారులు దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. పట్టణానికి చెందిన నిద్రబోయిన దత్తు అత్యధికంగా రూ.12.30 లక్షలు వేలం పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ఆధునిక కృత్రిమమేధస్సుపై కార్యశాల



కృత్రిమ మేధస్సు పై మాట్లాడుతున్న ప్రొఫెసర్ దృశ్యం

**పటాన్‌చెరు, మార్చి 24, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌కు చెందిన గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధునిక ఎఐ అన్వేషణ: సహజ భాషా ప్రాసెసింగ్ నుంచి అభిజ్ఞా మేధస్సు వరకు పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల ఆచరణాత్మక కార్యశాలను మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ శిబా ఉద్గాట ముఖ్యఅతిథిగా, కెపిఎంజి గ్లోబల్ డెలివరీ సెంటర్, హైదరాబాదుకు చెందిన డాక్టర్ కె.సంపత్‌కుమార్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. కార్యశాలలో డాక్టర్ పి.కృష్ణమూర్తి (ఐఐఐటి హైదరాబాదు), ప్రొఫెసర్ రమేష్‌కుమార్‌మిశ్రా (హైదరాబాదు విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ అనిమేష్ ముఖర్జీ (ఐఐటి ఖరగ్‌పూర్) వంటి ప్రముఖ నిపుణులు పాల్గొంటున్నారు. తొలుత, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా అతిథులను స్వాగతించి, సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ జాదవ్‌గణేష్ మార్గదర్శనంలో, డాక్టర్ కె.కృష్ణ, డాక్టర్ కె.భీమశంకర్ సహకారంతో డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి ఈకార్యశాలను సమన్వయంచేస్తున్నారు. విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర, దీప, సుష్మిక, స్నేహ వారికి సహకరిస్తున్నారు. విద్యార్థులతోపాటు పలువురు అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొంటున్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, మార్చి 24, ప్రభాతవార్త:**
పల్లెనుండి పట్నంవరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్‌డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకుసైతం సిద్ధమని పటాన్‌చెరు ఎమ్మెల్యే, రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన రేషన్‌డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల సంభవించినా, కరోనాలాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడంలో రేషన్‌డీలర్ల పాత్ర శ్లాఘనీయమన్నారు. దశాబ్దకాలంగా రేషన్‌డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలసమయంలో కాంగ్రెస్‌పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధానహామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో డీలర్ల సంఘం రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్‌డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్‌డీలర్‌కు 10లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిలు, కరోనాసమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబసభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## అక్రమనిర్మాణాలపై చర్యలేవి..?

**-కౌన్సిలర్ బెంబడి సంజీవరెడ్డి**



నిర్మాణంలో ఉన్న ప్రహరీగోడ, ఇన్‌సెట్‌లో సంజీవరెడ్డి

**గుమ్మడిదల, మార్చి 24, ప్రభాతవార్త:**
అక్రమ నిర్మాణాలు దర్జాగా కొనసాగుతున్నా అధికారులు అడ్డుకట్ట వేయక పోవడం సరైనదికాదని 8వవార్డు కౌన్సిలర్ బెంబడి సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం 261 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఓ పరిశ్రమ ఎకరాలకొద్ది భూమిని కాజేయడానికి ప్రహరీగోడను నిర్మిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ భూమికి సంబంధించిన కేసు హైకోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, ప్రహరీ నిర్మాణాలు చేస్తుండగా మున్సిపాల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఆవేదనవ్యక్తంచేశారు. 261/1 సర్వేనంబర్ 588.30 ఎకరాలు ఉండగా, ఇందులో 117ఎకరాలను పేదరైతులకు గతంలో ప్రభుత్వం పట్టాలు అందజేసిందన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కృషితో పట్టాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆరైతులకు చెందిన భూములు ఆన్‌లైన్‌లో రాకపోగా పట్టా పాసు పుస్తకాలు కూడా ఇవ్వలేదన్నారు. కాగా మంగళవారం ఓ భారీ పరిశ్రమ దర్జాగా 261/1లో అక్రమంగా కబ్జాచేసి ప్రహరీగోడ నిర్మాణాలు చేస్తుందన్నారు. ఇది కూడా బౌన్సర్లను పెట్టుకుని నిర్మాణాలు చేస్తుందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తున్న రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఈవిషయంపై ఈనెల 10వ తేదీన ఆర్టీఐ చట్టం కింద పూర్తివివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ స్పందించి అక్రమంగా నిర్మాణాలు కొనసాగుతోన్న భూములను రక్షించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల ఎదుట నిరాహారదీక్ష చేస్తానని హెచ్చరించారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దు..

**గుమ్మడిదల, మార్చి 24, ప్రభాతవార్త:**
సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరాకరించి పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని వక్తలు పిలుపునిచ్చారు. గుమ్మడిదల మండలంలోని మిలీనియం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు ప్లాస్టిక్‌రహిత జీవనవిధానాన్ని అవలంబించేందుకు సంకల్పించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ అలవాటును విడనాడండి -సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి అనే అంశంపై మంగళవారం గుమ్మడిదల మండలంలోని మిలీనియం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగాజరిగింది. కార్యక్రమంలో సుమారు 60మంది విద్యార్థులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, సిబ్బంది, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఉమాదేవి శెట్కార్

**నాగల్‌గిద్ద, మార్చి 24, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండల పరిధిలోని పగడిపల్లి గ్రామానికి చెందిన ప్రభుశెట్టి కుమారుడు కల్లప్ప వివాహ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహ వేడుకలకు జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సతీమణి ఉమాదేవి శెట్కార్, కుమార్తె గిరిజ శెట్కార్, మాజీ జడ్పీటిసి సభ్యులు సంగీత జితేందర్‌నాథ్ శెట్కార్, యువ నేత సాగర్ శెట్కార్‌లు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కేసుల పరిష్కారానికి కృషిచేయండి

**-పోలీసులు, న్యాయవాదులకు న్యాయమూర్తి కవితాదేవి సూచన**



లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కవితాదేవి

**జహీరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:**
ఈ నెల 28వ తారీఖున నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేలా చేసి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్మన్ జి కవితాదేవి పోలీసులకు, న్యాయవాదులకు సూచించారు. మంగళవారం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌పై నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అబ్దుల్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సీలు పాల్గొన్న పాల్గొనగా న్యాయమూర్తి కవితాదేవి పోలీసులకు, న్యాయవాదులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, ఎజిపి దత్తాత్రేయరెడ్డి, డిఎస్పీ బి.సైదానాయక్, సిఐలు శివలింగం, జక్కుల హన్మంతు, ఎస్ఐలు కె.వినయ్‌కుమార్, ఎం.కాశీనాథ్, రాజేందర్‌రెడ్డి, సురేష్, దోమ సుజిత్, క్రాంతిపాటిల్, చైతన్య, కిరణ్, కోర్టు కానిస్టేబుళ్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**-భగత్‌సింగ్ వర్ధంతి సభలో పటాన్‌చెరు సిఐ వినాయక్‌రెడ్డి**



ఉచిత వైద్య శిబిరం దృశ్యం

**పటాన్‌చెరు, మార్చి 24, ప్రభాతవార్త:**
యువత డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పటాన్‌చెరు సిఐ వినాయక్‌రెడ్డి తెలిపారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ప్రణం ఆస్పత్రి సహకారంతో ముత్తంగి డివిజన్‌లోని దేవి నర్సింగ్ స్కూల్లో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి పటాన్‌చెరు సిఐ వినాయక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ మెడికల్ క్యాంపును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, అనంతరం జరిగిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు అని ఆరోగ్యమే మహాభాగ్యమని ఆయన అన్నారు. యువతీ యువకులు డ్రగ్స్, మత్తుపదార్థాలకు చాలాదూరంగా ఉండాలని ఆయన కోరారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, జీవితాలు ఎందుకు పనికిరాకుండా అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అంతేకాకుండా మీజీవితాలతో పాటు మీ కుటుంబసభ్యుల జీవితాలుకూడా నాశనం అవుతాయి అనేది గ్రహించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మీకు భవిష్యత్తు ఉండదు, మీ కుటుంబానికి భవిష్యత్తు ఉండదని, అంతేకాకుండా జైలుశిక్షకూడా అనుభవిస్తారని ఆయన అన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య, హాస్పిటల్ మేనేజర్ రామకృష్ణలు మాట్లాడుతూ దేశం గురించి కూడా విద్యార్థులు, యువతీయువకులు ఆలోచించాలని, వచ్చిన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాలని ఈసందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సౌజన్య, వైద్యుల బృందం మేఘన, రజిత లెక్చరర్, అనిత, లక్ష్మి, అరవింద్, రాజు, రాజశేఖర్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన డిఈఓ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డిఈవో వెంకటేశ్వర్లు

**గుమ్మడిదల, మార్చి 24, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలలోని తరగతిగదులను పరిశీలించి, బోధనావిధానాన్ని ఆరాతీశారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన తీరు, రికార్డుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అదేవిధంగా పాఠశాలపరిసరాల పరిశుభ్రత, తాగునీటిసదుపాయం, మరుగుదొడ్ల పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సమర్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డిఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**వలసకార్మికుల పిల్లలకు విద్య, సంక్షేమ పథకాలను అందివ్వాలి...**

**-సంగారెడ్డి జిల్లా డిఈఓ వెంకటేశ్వర్లు**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో ఇటుకబట్టీల వద్ద పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం ఏడ్ ఎట్ యాక్షన్ (ఇండియా) సంస్థ ఆధ్వర్యంలో, ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ప్రత్యేక కార్యక్రమం ఘనంగానిర్వహించబడింది. ప్రతి సంవత్సరం లాగానే ఒడిశా రాష్ట్రం నుండి వలసగా వచ్చే కార్మికుల పిల్లలకోసం ఏడ్ ఎట్ యాక్షన్ సంస్థ 7 వర్క్‌సైట్ పాఠశాలలు, సిసిఎల్‌సి (చైల్డ్ కేర్ లెర్నింగ్ సెంటర్స్)ను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్ ద్వారా టేక్ హోమ్ రేషన్, ప్రభుత్వ ఆసుపత్రులద్వారా ఆరోగ్య సేవలు అందుతున్నాయి. ఈ సందర్భంగా పిల్లల ప్రతిభను ప్రోత్సహించేందుకు సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఒడిశా భాషలో, సంప్రదాయ వేషధారణలో పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైనవారిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, గుమ్మడిదల మండల విద్యాశాఖాధికారి పాలనారెడ్డి, సిడిపిఓ జయరాంనాయక్, అన్నారం ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ చక్రపాణి హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఏడ్ ఎట్ యాక్షన్ (ఇండియా) రీజినల్ మేనేజర్ సురేష్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కొత్త వెంకటేష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నటరాజ్, సూపర్‌వైజర్ గణేష్, సంస్థ ప్రతినిధులు రాంప్రనయ్, నవీన్, దుర్యోధన్, లక్ష్మీ, రాజారాం, నరేందర్, పూర్ణచందర్‌లతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పశు సంరక్షణకు జాగ్రత్తలు అవసరం



పశువుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
పశుసంరక్షణకు జాగ్రత్తలు అవసరం అని సెహగల్ ఫౌండేషన్ సభ్యులు కావ్య, విక్రాంత్‌లు తెలిపారు. మంగళవారం మండల పరిధి మడూర్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పరివర్తన్ సహకారంతో సర్పంచి దివ్యభారతి ఆధ్వర్యంలో పశుసంరక్షణ మందుల కిట్లను రైతులకు అందించారు. 90 శాతం రాయితీపై కిట్లను అందిస్తున్నామని తెలిపారు. ఈ కిట్లలో పశువుల ఆహారం జీర్ణించానికి, నట్టలనివారణ మందులు ఉన్నాయన్నారు. ఈ మందులు వాడటం వలన పశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పశు సంవర్ధక రంగం అభివృద్ధికి సెహగల్ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుడికాడి లింగంగౌడ్ తదితరులున్నారు.

## పశువులకు టీకాలు వేయించండి

**-మండల పశు వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్**



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి వినోద్‌కుమార్

**చిలిపిచెడ్, మార్చి 24, ప్రభాతవార్త:**
ప్రతి పశువుకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువువైద్యఅధికారి వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం చిలిపిచెడ్ మండలపరిధిలోని సోమక్కపేట్‌గ్రామాల్లో పశువుల గాలికుంటు నివారణ టీకాలను సర్పంచి బెస్త దుర్గాచలంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది యాదయ్య, నర్సింలు, శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన టెక్నో ఫెస్ట్ ఉత్సవాలు

**-ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**చౌటకూరు, మార్చి 24, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జెఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా కొనసాగుతున్న 14వ టెక్నికల్ ఫెస్ట్ 2026 ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిసాయి. రెండురోజుల పాటు ఫ్లాష్ మబ్, ట్రెడిషనల్ డే, వార్షికోత్సవ ఉత్సవాలను విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథరాజు పర్యవేక్షణలో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి సభికులను ఆకట్టుకున్నారు. డిజె సౌండ్‌మధ్య విద్యార్థులు పోటాపోటీగానృత్యాలుచేసి అలరించారు. ఆయా విభాగాలకు సంబంధించిన ఇంజనీరింగ్ బ్రాంచిలకు షీల్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, హెచ్‌ఓడిలు రజనేష్, జోషి శ్రీపాద్, శైలజ, బేబి శాలిని, డాక్టర్ సునీత, చంద్రశేఖరయ్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో జాతీయ టెక్‌ఫెస్ట్ హవానా

**పటాన్‌చెరు, మార్చి 24, ప్రభాతవార్త:**
రెండు రోజుల జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ హవానా2026 మంగళవారం హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లో ఘనంగా ప్రారంభమైంది. సాంకేతిక నైపుణ్యం అనుభూతులతో స్ఫూర్తిని రగిల్చే ఈ కార్యక్రమాన్ని ఈఈసీఈవిభాగానికిచెందిన జీఎలక్ట్రా(స్మార్ట్ సిస్టమ్స్ క్లబ్) నిర్వహిస్తోంది. ప్రారంభోత్సవంలో కాగ్నిటివ్ బోటిక్స్ చైర్మన్ ఉదయకుమార్ దింత్యాల గౌరవఅతిథిగా పాల్గొన్నారు. యాడ్ఆన్ మో సహ వ్యవస్థాపకుడు శ్రావంత్ గాజుల ఈ కార్యక్రమంలో గౌరవఅతిథిగా పాల్గొని, కీలకమైన వ్యవస్థాపక అంతర్దృష్టులను పంచుకున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి పాల్గొనగా, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి తాతినేని స్వాగతోపన్యాసం చేశారు. జీఎలక్ట్రా ఉపాధ్యక్షుడు ఎ.వేణుగోపాల్ స్మార్ట్ సిస్టమ్స్‌క్లబ్ కార్యకలాపాలపై నివేదికను సమర్పించగా, సంయుక్త కార్యదర్శి కె.శ్రావ్య వందనసమర్పణ చేశారు. సహ నిర్వాహకురాలు డాక్టర్ డి.అనిత, జీఎలక్ట్రా అధ్యక్షుడు ఎం.గౌరీశంకర్‌లతో కలిసి అధ్యాపకుడు ఎం.నరేష్‌కుమార్ కార్యక్రమనిర్వహణను సమన్వయం చేశారు. హవానా2026లో విభిన్నరకాల పోటీలతోపాటు, కృత్రిమ మేధస్సు, బ్లాక్ చెయిన్, రోబోటిక్స్ వంటి వర్ధమాన సాంకేతికతలపై సెషన్లు కూడా నిర్వహించారు. హైదరాబాదు నలుమూలల నుంచి 25 కళాశాలలకు చెందిన పలుబృందాలు ఈపోటీలలో పాల్గొంటున్నారు.

## బిఆర్ఎస్ నాయకుల అరెస్టు సరికాదు




పోలీసులు అరెస్టు చేసిన బిఆర్ఎస్ నాయకులు

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా చిన్నశంకరంపేట బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి, ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అత్తెలి నాగరాజు, లాలునాయక్‌లు ఉన్నారు.

## నేడు తైబజార్ వేలం

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
నేడు తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు గవ్వలపల్లి పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు బుధవారం (నేటి) ఉదయం 10గంటలకు గవ్వలపల్లి గ్రామ పంచాయతీకి వచ్చి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

## బివిఆర్ఐటిలో హ్యాక్‌ఫినిటీ 2026 హ్యాకథాన్

**నర్సాపూర్, మార్చి 24, ప్రభాతవార్త:**
నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటిలో మంగళవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్ విభాగం ఆధ్వర్యంలో, 24గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ అయిన హ్యాక్‌ఫినిటీ 2026ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈకార్యక్రమం ఉదయం10గంటలకు ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి వచ్చిన 126 జట్లకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యునైటెడ్ హెల్త్ గ్రూప్ అసోసియేట్ డైరెక్టర్ యుగ్ మాలిక్, గౌరవఅతిథిగా క్వెస్ట్ దయాగ్నస్టిక్స్ సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ నంది పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దుబే, కళాశాల మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్, వివిధశాఖల విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందిస్తున్న దృశ్యం

## ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేత

**ధూళిమిట్ట, మార్చి 24,ప్రభాతవార్త :** మండలంలోని జాలపల్లి గ్రామంలో 8 ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్స్ పత్రాలను గ్రామ సర్పంచ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో జాలపల్లి గ్రామానికి 8 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో వీరరాజు, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, ఉప సర్పంచ్ పరుషరాంగౌడ్, వార్డు సభ్యులు మంజుల, కావ్య, మంజుల, నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల డివిజన్ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

### జెఏసి అధికార ప్రతినిధి అందె అశోక్



మాట్లాడుతున్న అందె అశోక్

**చేర్యాల, మార్చి 24, ప్రభాతవార్త :** చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో ప్రతి ఒక్కరు కలిసి రావాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ అధికార ప్రతినిధి అందె అశోక్ కోరారు. మంగళవారం జేఏసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీ అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందని ప్రజల పోరాటాలను పట్టించుకోని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ అంశాన్ని నీరుగార్చి ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేసిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ప్రకటిస్తామని నాటి టీపీసీసీ అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్ష మేరకే రాజకీయ పార్టీల నాయకులు పనిచేయాలన్నారు. జెండాలు పక్కన పెట్టి రెవెన్యూ డివిజన్ ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. త్వరలో గ్రామ, మండల కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఈరి భూమయ్య, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, వెన్నెల, రాజు, మల్లేశం ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో బాలమేళ



అంగన్‌వాడీ కేంద్రంలో బాలమేళా నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మార్చి 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాలమేళా ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ పాఠశాలల్లో పిల్లలు నేర్చుకున్న విద్యతోపాటు ఆటలు పాటలు నృత్యాలను ప్రదర్శించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటలు నృత్యాలతో అందరిని అకట్టుకున్నారు. తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలిపల్లి అనిల్, ఉప సర్పంచ్ రాగి నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్జుయాదవ్, వార్డు సభ్యులు చింతల లచ్చవ్వ, వెంకట నర్సవ్వ, శారద, అపర్ణ, కిషన్, రాజబాబు, పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, సీఆర్‌పి మౌనిక, ఎఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్లు ఉమాలత, యశోధ, ఆశాకార్యకర్తలు మమతా, మౌనిక, పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మంగోల్‌లో...**



మంగోల్‌లో బాల మేళ నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామంలో మంగళవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాధవి అధ్వర్యంలో బాలమేళ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి పిల్లలతో అటలు అడించి, పాటలు పాడించారు. అట పాటల ద్వారా విద్యను బోధించే విధానం గురించి వివరించారు. ఫ్రీ స్కూల్ టిఎల్ఎం ప్రదర్శించి వాటివల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్మక్కపల్లి కర్ణాకర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లింద్రులు, అంగన్‌వాడి టీచర్లు, రిలయన్స్ పౌండేషన్ ప్రతినిధులు, క్రై అర్గనైజేషన్ సభ్యులు, సిఅర్‌పి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

### బిఆర్ఎస్ నేత బుర్ర శ్రీనివాస్ గౌడ్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 24, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మూర్తికి బీఆర్ఎస్ నాయకులతో వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతప్ప మిగతా గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు పెంచుతామని చెప్పిన హామీ కూడా అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయాలని, లేకపోతే ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీ రెడ్డి, శ్యాంసుందర్, జగన్, శ్రీనివాస్, అరవింద్ పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

# విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

### టిపిటిఎఫ్ నాయకులు

**సిద్దిపేట రూరల్, మార్చి 24, ప్రభాతవార్త :** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 2023 జూలై నుంచి రావాల్సి పిఆర్‌సిని ప్రకటించడం లేదన్నారు. రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా మానసిక ఆందోళనకు గురిచేస్తుందని వెంటనే బిల్లులు చెల్లించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు కనకయ్య, రాష్ట్ర అకాడమిక్ సెల్ కన్వీనర్ ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషనర్ రిపోర్టు ప్రకారం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్‌లోఉన్న బిల్లులు, డిఏలు విడుదల చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ ప్రతినిధులు సత్యనారాయణ, మల్లేశం, అజీజ్, పాపిరెడ్డి, రాంరెడ్డి, సత్యకృష్ణ, రాములు, మంజుల, వెంకటరమణ, రామస్వామి, రాజు, జానకీరాములు, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్, అనిల్‌కుమార్, ఎల్లం, రాజు, సురేందర్ రెడ్డి, సురేందర్, రాములు, గోపాల్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశం, విద్యాసాగర్, సత్తయ్య, పోచం పాల్గొన్నారు.





కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేస్తున్న టిపిటిఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న సయ్యద్ సలీం, కడపల్ల నర్సింహారెడ్డి

## రైతులకు అండగా నిలిచిన సిఎం రేవంత్‌రెడ్డి

**ములుగు, మార్చి 24 (ప్రభాతవార్త):** రైతు భరోసా నిధులు మంజూరుచేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచినట్లు సిద్దిపేట జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడపల్ల నర్సింహారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చిన పాలనసాగిస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అందిస్తున్నారని తెలిపారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం దృష్టికి వచ్చిన ఆయా శాఖల అభివృద్ధియే లక్ష్యంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపుకు ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. నూతనంగా శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా నిధులతో రైతులకు అండగా నిలిచిన సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కుతాడి శ్రీనివాస్, వాజిద్, వార్డు సభ్యుడు మంద వెంకటేష్, నాయకులు ముత్యాలు, నరేందర్‌రెడ్డి, భూమన్న రాజు, కాముని కంతల రాములు, గాలయ్య, షరీఫొద్దీన్, ఖదీర్, గోపాల్, కుమార్, దేవేందర్, దర్శనం నర్సింలు, తలారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త విభజనపై అవగాహన సదస్సు

**హుస్నాబాద్ టౌన్, మార్చి 24, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 7వ వార్డు గణేష్ నగర్‌లో పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం చెత్త విభజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలు, డ్రైనేజీలలో చెత్త వేయకుండా పట్టణ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి మొక్కలకు ఉపయోగించుకోవచ్చుని, పొడి చెత్తను రీసైక్లింగ్ సెంటర్లకు పంపాలని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మెప్మా ఆధ్వర్యంలో ఉన్న స్టీల్ బ్యాంకులను వినియోగించాలని ప్రజలకు సూచించారు. అనంతరం పురపాలక సంఘం తయారు చేసిన సేంద్రియ ఎరువును వార్డ్ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ ప్రసాద్, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డ్ ఆర్‌పి జగదీశ్వరి, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, జవాన్ సారయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాగులపై బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి: బిఆర్ఎస్ నేతలు

**హుస్నాబాద్ రూరల్, మార్చి 24, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామం నుండి మాలపల్లి గ్రామానికి వెళ్లే వాగులో బ్రిడ్జ్ నిర్మాణం చేయాలని, అలాగే కూచనపల్లి నుండి హుస్నాబాద్ వెళ్లే మార్గంలోని అంకుస్ గండి వాగుపై బ్రిడ్జ నిర్మించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న వర్షం వచ్చినా వాగుల్లో నీటి ప్రవాహం పెరిగి ప్రజలు దాటలేని పరిస్థితి ఏర్పడుతుందని, చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఈ సమస్యను ఎన్నోసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి వెంటనే బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని గాల్ రెడ్డి, మేకల వికాస్‌యాదవ్, యాస శ్రీనివాస్, రైతులు గికూరు తిరుపతి, నరసయ్య, బంక రాజు, బండి చంద్రం, గుళ్ళ సారయ్య, సతీష్, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతు భరోసా దరఖాస్తులకు నేడే చివరి తేదీ

**రాయపోల్, మార్చి 24 (ప్రభాతవార్త):** రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ చివరి తేదీ అని మండల వ్యవసాయాధికారి నరేష్ తెలిపారు. 2026 ఫిబ్రవరి 28 లోపు భూమి పొందిన అర్హులైన రైతులు యాసంగి రైతుభరోసా పొందడానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోని అర్హులైన రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, మొబైల్ నెంబర్‌తో సమీపంలోని వ్యవసాయ విస్తరణాధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు.

## చలివేంద్రం ప్రారంభం

**గజ్వేల్ టౌన్, మార్చి 24 (ప్రభాతవార్త):** ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వాసవిమాత చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి వచ్చే ప్రయాణికుల, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు నంగునూరి సత్యనారాయణ, డాక్టర్ లింగం, అంతునూరి శివకుమార్, తోట బిక్షపతి, తోట బిక్షపతి, సిద్ది బిక్షపతి, శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్, ఎన్‌సి.శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, గందె సంతోష్, నేతి శ్రీనివాస్, ఉప్పల కృష్ణమూర్తి, మర్యాల లింగం, దూబకుంట లచ్చుల్, మెట్రామలు, ప్రభాకర్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపడి ఎద్దు మృతి

**నారాయణఖేడ్, మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అక్లీయి తండాలో మంగళవారం భారీ వర్షంతోపాటు పిడుగుపడి ఒక ఎద్దు మృతి చెందింది. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం పడడమేగాక పిడుగు పడడంతో జాదవ్ నాయక్‌కు చెందిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఈఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వ్యవసాయ పనులలో కీలక పాత్ర పోషించే ఎద్దు కోల్పోవడం వల్ల వారికి ఆర్థికంగా కూడా పెద్ద దెబ్బ తగిలింది. గ్రామస్థులు ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు ఘటనను నమోదు చేసి బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





నిధులు మంజూరుచేయాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## రామలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

### ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త :** లకుడారంలోని శ్రీసీతారామచద్ర స్వామి దేవాలయం అసంపూర్తిగా ఉందని దాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావుకు ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మంగళశారం హైదరాబాద్‌లోని అయన కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన దేవాలయం పనులు పూర్తికాక నిధులలేమితో అసంపూర్తిగా ఉందన్నారు. దేవాలయం నిర్మాణానికి నిధులు మంజూరి చేసి సహకరించాలని చేయాలని కోరారు. గ్రామంలో ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి రోజు శ్రీసీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నమని గ్రామంలో ఊరేగింపు (శోభయాత్ర) కోసం టిటిడి ద్వారా పంచలోహ విగ్రహలను ఇప్పించాలని అయనకు విన్నవించారు. అయన వెంట సర్పంచ్ భర్త చిక్కుడు నర్సింలు, వార్డు సభ్యులు గట్టు చంద్రం, నాయకులు రాచకొండ బిక్షపతి, సంతోష్ గుప్త, రాచకొండ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నల్ల బిల్లులు రద్దు చేయాలి

### బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జీ రవిందర్‌గౌడ్





మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 24, ప్రభాతవార్త :** పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను మున్సిపాలిటీలో జరగబోయే పాలకవర్గ సమావేశంలో పరిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. మంగళవారం బిఎస్పి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు కోతుల సమస్య తీవ్రంగా మారి ప్రజలు గాయాల పాలవుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఇటీవల అఖిలపక్ష నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి కోతులను నివారించాలని కోరినట్లు చెప్పారు. అదేవిధంగా గతంలో మిషన్ భగీరథ నల్ల కనెక్షన్లు ఉచితమని చెప్పి బిల్లులు వసూలు చేయలేదని, కానీ ప్రస్తుతం 2015 నుండి ఒక్కో ఇంటిపై రూ.9,000 వరకు బకాయిలు నమోదు చేసి వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి నల్ల బిల్లుల నుండి ప్రజలను విముక్తి చేయాలని కోరారు. అలాగే హుస్నాబాద్ అంగడి విషయాన్ని రాజకీయం చేయకుండా నిబంధనల ప్రకారం రెండవ వేలంపాటదారుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై పాలకవర్గ సమావేశంలో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**పాపన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. మంగళవారం పాపన్నపేట మంజీరా గార్డెన్‌లో షాది ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ మే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా నాయకులు ప్రశాంత్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ రాథోడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్, స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, మాజీ కోప్షన్ సభ్యులు గౌస్, సర్పంచులు శ్రీధర్, ఎగొండ, శ్రీశైలం అప్ప, రజిత రాజశేఖర్, భాగ్యమ్మ, పద్మా, నాయకులు రాములు, శివయ్య, ప్రవీణ్, రమణ, ఈశ్వరప్ప, శ్రీనివాస్, తోపాటు వివిధ గ్రామాల లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

**గజ్వేల్ టౌన్, మార్చి 24 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో శ్రీసీతారామ లక్ష్మణ భక్తాంజనేయ, గణపతి, నందీశ్వర, రామ లింగేశ్వరస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆలయ కమిటీ, భక్త బృందం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించగా, ఉదయం ఆవాహిత దేవతపూజ, జానాదివాసం, ఆవాహిత దేవత హవనం, మూలమంత్ర హవనం నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంటలకు స్వామివార్లకు మహాభిషేకం, చతుర్పద బలి కార్యక్రమాలను నిర్వహించగా, సాయంత్రం 4 గంటల నుండి శయ్యాదివాసం, పుష్పాదివాసం, ఆదివాస హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మంగళహారతి, మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈనెల 27వ తేదీ శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## జాగరణలో పాల్గొన్న ఉద్యమ నేత ఆర్వీ

**బేగంబజార్, మార్చి 24ప్రభాతవార్త:** శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళ్‌హాట్ డివిజన్‌లో నిర్వహించిన మాతా జాగరణ పూజలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్‌కుమార్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం కోసం ప్రతి ఒకరు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో రూపేష్, హరి, మల్లేష్ ముదిరాజ్, బి.రాజేందర్, బాకేష్‌సింగ్, గోపాల్‌సింగ్, సంజయ్‌సింగ్ తదితరులుపాల్గొన్నారు.





మల్లికార్జున స్వామి దేవాలయంలో టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీమల్లికార్జునస్వామి దేవాలయ దుకాణాలకు వేలం

**కొమురవెల్లి, మార్చి 24, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం ఆవరణలో వివిధ షాపుల నిర్వహణకు మంగళవారం అధికారులు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. పూజ సామగ్రి అమ్ముకోవడానికి 2026 ఏప్రిల్ 4 నుంచి 2027 మార్చి 31 వరకు షాపు నంబరు-1 కొరిమి మధు, షాపు నంబరు-2ను 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు జి.దశరథం హెచ్చుపాట దక్కించుకున్నారు. టిటిడి వద్ద రాతిగీరల పక్కన గల షాపింగ్ కాంప్లెక్స్‌లో వివిధ షాపులకు రెండు యేండ్లకు గాను ఒక సంవత్సరం హెచ్చుపాట పాడి షాపు నంబరు-25జిని వెంకటేష్, షాపు నంబరు-22జి శ్యామ్, షాపు నంబరు 26-జి. మల్లేశంలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణప్రసాద్, టెండర్ దారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**నంగునూర్, మార్చి 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సిద్దన్నపేట గ్రామానికి చెందిన సంగు అంజనేయులు అనారోగ్యంతో మరణించడంతో సర్పంచ్ సంగు పురేందర్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం కింద రూ.5 వేలు పంపించారు. దీంతో నర్సింలుగౌడ్, బెదురు మల్లేశం, పెద్ది రాజు, శివరామ్, బాలకిషన్ సిద్దు లింగం, మహేందర్ చేతుల మీదుగా మంగళవారం బాధిత కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించిన యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డికి బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సిద్దిపేటలో ఉచిత ఆరోగ్య శిబిరం

**సిద్దిపేట అర్బన్, మార్చి 24, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సిద్దిపేట, నంగునూర్, చిన్నకోదూరు, కొండపాక మండలాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం యశోద ఆసుపత్రి సోమాజిగూడ సౌజన్యంతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ అభిషేక్ బార్లీ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకల అరుగుదలకు చాలా కారణాలు ఉంటాయన్నారు. ఎముకల అరుగుదలపై అశ్రద్ధ చేయకుండా వైద్యుల సూచన మేరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. శిబిరంలో 98 మందికి గుండె, ఆర్థోపెడిక్, బిఎండి తదితర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 16 మందికి మోకీలు మార్పిడి చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఆయా మండలాల అధ్యక్షులు, సంఘం ప్రతినిధులు రాగుల రాజిరెడ్డి, జైన సత్యం, రామకిష్టయ్య, మహంకాళి, భూంరెడ్డి, గాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మల్లేశం, రాంరెడ్డి, వీరయ్య, రత్నాకర్‌రెడ్డి, ముత్యరెడ్డి, జానకిరాములు, కృపాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**వెంకట్రావ్‌పేటలో...**

**అల్లాదుర్గం, మార్చి 24, ప్రభాతవార్త:** ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన సందర్భాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటలో మంగళవారం ముక్త్ భారత్ ప్రజాపాలన ఆరోగ్య ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు వైద్యులు, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఎల్‌హెచ్‌పి పి సంధ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఏసుమణి, సూపర్‌వైజర్ నర్సమ్మ, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**మిరుదొడ్డి, మార్చి 24, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కమ్మరి చంద్రం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదేశాలమేరకు మంగళవారం నర్ర రాజిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు మద్దెల సుదర్శన్‌ల చేతుల మీదుగా 50 కిలల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంగనమైన రామక్రిష్ణ, చిన్నగల్ల బాలకుమార్, మల్కాపురం పెద్ద నర్సింలు, స్వామి, రామస్వామి, సోషల్ మీడియా ఇన్‌చార్జి డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**చిన్నకోడూరు, మార్చి 24, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్ కుమారుడు దిలీప్(30) మృతి చెందడంతో మంగళవారం యువనాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా దిలీప్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అపారమైన దు:ఖాన్ని తట్టుకునే ధైర్యం దేవుడు ఇవ్వాలని ప్రార్థించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బంకా వెంకవ్వ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట కుండె తిరుపతి(బీరయ్య) గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**హత్నూర, మార్చి 24, ప్రభాతవార్త :** హత్నూర మండలం నవబుపేట్ గ్రామం పరిధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం 25 వార్షికోత్సవ, కళ్యాణోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మంగళవారం స్వామివారి కళ్యాణోత్సవం వేదపండితుల మంత్రోత్సవాల మధ్య వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

## మాజీ ఎమ్మెల్యేలకు ఆహ్వాన పత్రికల అందజేత

**రామాయంపేట, మార్చి 24, ప్రభాతవార్త :** పట్టణంలోని కళ్యాణ రామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 27న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న సీతారాముల కళ్యాణానికి ప్రముఖులకు ఆహ్వానాలు అందజేస్తున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం దేవాలయ కమిటీ సభ్యులు మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మరియు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు దేవాలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసి శ్రీరామనవమి పర్వదినాన జరిగే సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొని ఆశీర్వాదాలు పొందుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు నవాత్ మహేష్, మధునాల స్వామిగౌడ్, నక్క సిద్దరాములు, సాంగని సుధాకర్, కటికె రాజు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**రాయపోల్, మార్చి 24 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని బిజెపి రాయపోల్ మండల పార్టీ అధ్యక్షుడు మంకిడి స్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎంఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంకిడి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు నిధులు అందడం లేదని, గ్రామాల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రోళ్ల దివ్య కృష్ణ, ఉపసర్పంచ్ వీరేశం, బిజెపి గ్రామ అధ్యక్షుడు స్వామి, వార్డు సభ్యులు కళ్యాణి రాజు, నర్సింలు, మమత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆరెపల్లిలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

# ఎన్ఎంఎంఎస్‌తో కూలీలకు తప్పని తిప్పలు

-ముఖచిత్ర గుర్తింపులో తీవ్ర జాప్యం
-క్షేత్రస్థాయిలో చలువ పందిళ్లు, నీళ్ల లోపం
-లక్ష్యం పూర్తి చేయలేక చేతులు ఎత్తేస్తున్న ఎఫ్ఎలు



తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న కూలీల దృశ్యం

**కొడిపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:**
ఉపాధిహామీలో కూలీలకు సముచిత న్యాయం జరిగి పనికితగ్గ వేతనం నేరుగా కూలీలకు చెందాలనే దృఢసంకల్పంతో కేంద్రంప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ కొత్త యాప్‌తో రోజువారి హాజర్ నమోదుచేసుకోవడానికి కూలీలకు తప్పని తిప్పలుగా మారిపోయింది. మంగళవారం మండలపరిధిలోని ముద్రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కూలీలు ఉపాధిహామీ పనులు చేయడానికివెళ్లి తమపనులు ముగించుకున్న తర్వాత హాజర్ పట్టికలో తమ పేర్లను నమోదు చేసుకోవాలంటే తప్పనిసరిగా నూతన యాప్ ఎన్ఎంఎంఎస్ ద్వారా చేసుకోవాల్సిందే. దీంతో అటవీప్రాంతంలో పనిచేసే చోట యాప్‌ను అంతర్‌జాలంతో ఓపెన్‌చేసి కూలీల ముఖచిత్రాలను పసిగట్టి కూలీల హాజర్ నమోదు చేస్తుంది. ఈ యాప్ పనితీరు భేషుగ్గా ఉందని చెప్పడానికి సందేహంలేదు, కాని అక్కడ ఇంటర్నెట్ (అంతర్‌జాలం) సిగ్నల్స్ సరిగా రాకపోవడంతో కూలీల హాజర్ వేయడానికి దాదాపు 2 గంటల నుండి 4 గంటల వరకు సమయం పడుతుండటంతో కూలీలు తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో పాటు క్షేత్ర సహాయకులపై వాగ్వివాదానికి దిగుతున్నారు. ముద్రాజ్‌పల్లి ఎఫ్ఎ సార మంగమ్మలింగంగౌడు యాప్‌ద్వారా కూలీల హాజర్ నమోదుచేసే సమయంలో కూలీలను శాంతియుతంగా ఉంచడం తలకుమించిన పనిగా మారిపోతుందని కూలీలు వాపోతున్నారు. పైగా అసలే వేసవి వేడిమి తీవ్రత అధికమైతుండగా ఉపాధిహామీ కూలీపనులు చేసే చోట పచ్చటి చలువపందిళ్ల లేక, కూలీల దాహార్తిని తీర్చేందుకు త్రాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఎఫ్ఎ తెలిపారు. ఆ యాప్ ద్వారా ఉపాధి జాబ్ కార్డు ఇవ్వాలంటే కూలీల ముఖచిత్రం గుర్తుపట్టి ఫోటో అప్‌లోడింగ్ కావటానికి సుమారుగా ఒక్క ఫోటోకు మరొక ఫోటోకు 2 నుండి 4 గంటల సమయం పట్టడంతో ఉపాధికూలీలసంఖ్య పెంచటంతోపాటు కూలీలకు పనులు కల్పించుటకు ఈ యాప్‌ద్వారా తీవ్ర జాప్యం జరుగుతుందని ఎఫ్ఎలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ యాప్‌ద్వారా గత మూడు నెలల నుంచి హాజర్ నమోదు చేసినా, నేటివరకు కూలీలకు వేతనాలు ప్రభుత్వం చెల్లించక పోగా కూలీలు ఎఫ్ఎలపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ యాప్‌ద్వారా పనులచేసే ప్రదేశాలను నమోదుచేసిన కూలీల హాజర్ నమోదు చేయాల్సి వస్తే ఉపాధిహామీ కూలీలకు మేము రామని కూలీలు మొరాయించి పనులకు రాలేకపోవటంవల్ల ఎఫ్ఎలు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను అధిగమించలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధిహామీ కూలీల హాజర్ నమోదుకు నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ ఇంటర్నెట్ సిగ్నల్ గేమ్స్‌ను పెంచుతూ, కొంత వెసులుబాటు కల్పించితే బాగుటుందని కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బడ్జెట్ తీర్మానాన్ని ఆమోదించిన మార్కెట్ కమిటీ

**సదాశివపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
2026-27 సంవత్సరానికిగాను సదాశివపేట మార్కెట్‌కు సంబంధించి బడ్జెట్‌ను సంబంధిత అధికారులు రూపొందించారు. ఈ బడ్జెట్‌కు మార్కెట్ కమిటీ ఆమోదం తెలిపింది. మార్కెట్ కమిటీ చైర్మన్ మస్కు అలివేణి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో వైస్‌చైర్మన్ కంది కృష్ణ, గౌరవసభ్యులు నరేందర్‌గౌడ్, సయ్యద్ యూసుఫ్, పట్లోల శివకుమార్, మధుకర్‌రెడ్డి విశ్వనాథ్, కళావతి, కార్యవర్గ సభ్యులు కొత్త లక్ష్మణ్‌కుమార్, కొమ్ము రమేష్, కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణను మార్కెట్ కమిటీ చైర్మన్ మస్కు అలివేణి నరసింహారెడ్డి పుష్పగుచ్ఛము, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## సెలవులొస్తున్నాయి...జర పిల్లలు జాగ్రత్త

-మండల ప్రజలకు ఎస్ఐ దోమ సుజిత్

**న్యాల్‌కల్, మార్చి 24, ప్రభాతవార్త:**
విద్యార్థుల వార్షిక పరీక్షలు ముగియవస్తుండటం, వేసవి సెలవులు ప్రారంభం కానున్నందున తమ చిన్నారు(విద్యార్థులు)లను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచడంతోపాటు వ్యవసాయబావులు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా పోషకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ దోమ సుజిత్ మండల ప్రజలకు సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసాయని, 10వ తరగతి పరీక్షలు ముగియవస్తున్నందున విద్యార్థుల నడవడికపై పోషకులు కన్నేసి ఉండాలన్నారు. విద్యార్థులు ఎండలో తిరుగకుండా, ఈత కొట్టేందుకు వ్యవసాయ బావులు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా అవగాహనకల్పించాలని సూచించారు. మండలప్రజలు నియమనిబంధనలు పాటిస్తూ వాహనాలను రోడ్డెక్కించాలని ఎస్ఐ దోమ సుజిత్ సూచించారు.

## ప్రపంచ బందిపోటుగా మారిన సామ్రాజ్యవాదం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు

**సదాశివపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
ప్రపంచ బందిపోటుగా మారిన అమెరికన్ సామ్రాజవాదాన్ని ఎదిరిద్దామని, లౌకిక భారతదేశాన్ని కాపాడుకునేందుకు మతోన్మాద శక్తులను పెకిలిద్దామని, భగత్‌సింగ్ ఆశయాల సాధనకోసం ఉద్యమించాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజు అన్నారు. ఈరోజు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సదాశివపేట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈసందర్భంగా జయరాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ కోరుకున్న సమసమాజం కోసం కార్మికులు, యువత పోరాడాలన్నారు. దేశపౌరులుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న మతతత్వ, మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాలకు వ్యతిరేకంగా, ప్రపంచాధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న సామ్రాజవాదానికి వ్యతిరేకంగా కలసికట్టుగా ఐక్యంగా పోరాడటమే భగత్‌సింగ్‌కు అర్పించే నిజమైననివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏరియా కమిటీ సభ్యులు రమేష్‌గౌడ్, భూషణం, ఏసబ్ తదితరులు పాల్గొన్నారు.

## సాదాబైనామా దరఖాస్తులను క్రమబద్ధీకరించాలి

-ల్యాండ్ సర్వేయర్ సమస్య తీర్చండి
-శాసనమండలిలో ఎమ్మెల్యే అంజిరెడ్డి

**రామచంద్రాపురం, మార్చి 24, ప్రభాతవార్త:**
సాదాబైనామాకోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. బుధవారం శాసనమండలిలో క్వశ్చన్ అవర్‌లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఏళ్లతరబడి సాదా కాగితం ఆధారంగా భూములు కొనుగోలుచేసిన రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారంలోకి రాగానే క్రమబద్ధీకరణ చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా సమస్యను పరిష్కరించడంలో శ్రద్ధచూపడంలేదని విచారం వ్యక్తంచేశారు. విచారణ పేరుతో తహసీల్దార్‌లు, ఆర్‌డిఓలు లాగిన్‌లో దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్తగా ల్యాండ్ సర్వేలను తీసుకున్నా ఫీల్డ్‌లోకి వెళ్లడంలేదని ఆరోపించారు. సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలచేసినా, ఆశించిన మేర ప్రయోజనం కనపడడంలేదన్నారు. గరిష్ఠంగా 5ఎకరాల వరకు కాగితాలపై నమోదైన భూములను క్రమబద్ధీకరించాలని ఉందని, ఈవిస్తీర్ణాన్ని పెంచాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్‌చేశారు.

## బిఆర్ఎస్వీ నేత ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ తొంట కృష్ణకాంత్

**రామచంద్రాపురం, మార్చి 24, ప్రభాతవార్త:**
విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదలచేయాలని శాసనసభ ముట్టడికి వెళుతున్న బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ తొంట కృష్ణకాంత్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుఠాణాకు తరలించారు. అక్రమ అరెస్టులు తగదని తొంట కృష్ణకాంత్ హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మున్సిపల్ చైర్‌పర్సన్ అంజమ్మకు సన్మానం చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
మంగళవారం వ్యవసాయ మార్కెట్‌కమిటీ, సదాశివపేట కార్యాలయంలో చైర్‌పర్సన్ మస్కుల అలివేణి అధ్యక్షతన, వైస్‌చైర్మన్ కంది కృష్ణ కార్యవర్గసభ్యుల ఆధ్వర్యంలో కమిటీ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయనైనది. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మను సన్మానించడం జరిగినది. 2026-27 సంవత్సరానికి మార్కెట్ కమిటీ బడ్జెట్ తీర్మానించడమైనది. కార్యక్రమానికి సభ్యులు గడిన్ల నరేందర్‌గౌడ్, సయ్యద్ యూసుఫ్, పట్లోళ్ల శివకుమార్, విశ్వనాథ్ కళావతి, మధుకర్ రెడ్డి, చైర్‌పర్సన్ మున్సిపాలిటీ, కొత్త లక్ష్మణ్‌కుమార్, కొమ్ము రమేష్, కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయవ్యాధిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

**గుమ్మడిదల, మార్చి 24, ప్రభాతవార్త:**
ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మండలం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో క్షయ (టిబి) వ్యాధిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు టిబిలక్షణాలు, నివారణచర్యలు, చికిత్సపై వివరించారు. కార్యక్రమాల్లో గ్రామాలవారీగా ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.మధుకర్, హెచ్ఓ శ్రీనివాస్, కళ్యాణి, భాగ్యలక్ష్మి, సభ, రేవంత్, అలాగే ఎఎన్ఎంలు స్వరూప, శశికళ, మణెమ్మ, వసంత, వసుంధర, శంతన, ఎస్తేర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మార్చి 24, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారంచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలతో పాటు, గృహనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని దుర్వినియోగం చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలో ఇల్లులేని కుటుంబాలు వేలసంఖ్యలో ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా ఇళ్లకేటాయింపును పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, స్థానిక కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై దృష్టి సారించాలి

-అభివృద్ధి కార్యక్రమాలపై ఆరాతీస్తున్న వైస్‌చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్య



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న చిమ్ముల సంధ్య

**గుమ్మడిదల, మార్చి 24, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్ ప్రణాళికలపై గుమ్మడిదల మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్ దశరథను నేరుగా ప్రశ్నిస్తూ, ప్రజల సమస్యలపై తక్షణస్పందన ఇవ్వాలని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్య కోరారు. అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో కలిసి గుమ్మడిదల మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బెంబిడి సంజీవరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీచేసిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, మార్చి 24, ప్రభాతవార్త:**
సిఎం సహాయనిధి కింద తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గాలి రాములుకు మంజూరైన చెక్కును మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సిఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి శ్రీనివాస్, టిఆర్ఎస్ గ్రామాధ్యక్షులు శ్రీరామ్, యాదయ్య, నాయకులు ఆంజనేయులుగౌడ్, దుర్గేష్, మహేష్‌లున్నారు.

## వీరభద్రస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

-రూ.16.96 లక్షల ఆదాయం



హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, మార్చి 24, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి, వీరన్నగూడెం వార్డులో కొలువై ఉన్న వీరభద్రస్వామి దేవస్థానంలో హుండీలెక్కింపు కార్యక్రమం నిర్వహించగా మొత్తం 118రోజుల హుండీ ఆదాయం రూ.16,96,418గా నమోదైంది. అదేవిధంగా అన్నదానహుండీ ద్వారా రూ.70,684 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నాచారం, రంగాచారి, వీరభద్రస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్‌గుప్తా, మాజీచైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. అలాగే మాజీధర్మకర్తలు భాస్కర్‌గౌడ్, యాదగిరిగౌడ్, పూజారి కృష్ణ, పొన్నబోయిన రాజు, ఆశ, మండల శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమార్‌గౌడ్, గిద్దే విజయలక్ష్మి, జైపాల్‌రెడ్డి, పెద్దలు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, హుస్సేన్, సత్యం సేవా సంస్థ, లలితా సేవాసంస్థ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది సంతోష్‌కుమార్, అర్చకులు, దేవస్థానంసిబ్బంది పాల్గొన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.

## మట్టిని సేకరించిన వ్యవసాయ అధికారులు



పరీక్షల నిమిత్తం మట్టిని సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

**న్యాల్‌కల్, మార్చి 24, ప్రభాతవార్త:**
మట్టిపరీక్షల నిమిత్తం మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో మట్టిని సేకరించారు. మట్టిపరీక్షలు చేసి ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేస్తే అధికదిగుబడులు సాధించుకునే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ సహాయ సంచాలకులు బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి ఎన్.అవినాష్‌వర్మ అన్నారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, బోడపల్లి శ్రీశైలం, హోతి ప్రశాంత్, జక్కుల శ్రీనివాస్, సంగారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో ఘనంగా ఈద్ మిలాప్



కంది పాఠశాలలో ఈద్ మిలాప్ జరుపుకుంటున్న దృశ్యం

**కంది, మార్చి 24, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కందిలోని పాఠశాలలో మంగళవారం ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తన్వీర్ ఫాతిమా, కందిలోని లక్ష్మీనగర్ పాఠశాల ఉపాధ్యాయులు ఎండి ఖంరోద్దిన్‌లు సంయుక్తంగా ఈద్ మిలాప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో చేర్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాజయ్య, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

-టేకూర్ గ్రామ సభలో సర్పంచ్ సంగీత నాగేశ్వర్

**న్యాల్‌కల్, మార్చి 24, ప్రభాతవార్త:**
గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని మండల పరిధిలోని టేకూర్ గ్రామసర్పంచి సంగీతనాగేశ్వర్ అన్నారు. మంగళవారం టేకూర్ గ్రామంలో సర్పంచి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం నెలకొనేలా, తాగునీరు అందేలా, గ్రామంలోని సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనుల కోసం తనవంతు కృషిచేస్తానని, అందుకు గ్రామస్థులు తమవంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విగ్నేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైపాల్, వార్డుసభ్యులు రేణుక, మచ్చేందర్, దూడ ఈరన్న, పట్లోళ్ల శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ శాంతమ్మ, ఆశావర్కర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కార్డు లేని అభాగ్యులకు అండ ఎవరు..?

-విశ్రాంత మండల విద్యాధికారి అంజయ్య



వలస కార్మికుల పిల్లలతో విశ్రాంత ఎంఈఓ అంజయ్య

**సదాశివపేట, మార్చి 24, ప్రభాతవార్త:**
ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు తప్పనిసరి అయింది. జనన ధృవీకరణ పత్రం లేనిదే ఆధార్ కార్డు జారీకాదు. అనాథ పిల్లలకు, కుటుంబంలో పట్టించుకునేవారు లేకపోవడంతోను, ఆధార్ కార్డు అవసరం గురించి తెలియకపోవడంతోను, తరువాత తెలిసినా, ఎలా తీసుకోవాలో తెలియకపోవడంతో చాలామంది విద్యకుగాని, ప్రభుత్వ పథకాలకుగాని దూరమవుతున్నారు. ఈ కారణంగా విద్యకు దూరమవుతున్న అనాథల గురించి పట్టించుకునే వాళ్లే కరువైపోయారు. జనన ధృవీకరణ పత్రం లేకపోవడంతో ఆధార్‌కార్డు జారీకావడంలేదు. దీనిని ప్రభుత్వం న్యాయపరంగా ఆలోచించి ఆధార్‌కార్డు లేని అనాథలు విద్యకు దూరంకాకుండా తగినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నానని విశ్రాంత మండల విద్యాధికారి అంజయ్య అన్నారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలతో అభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

**చిలిపిచెడ్, మార్చి 24, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అసెంబ్లీలో రైతులపక్షాన గొంతు ఎత్తి సింగూర్ జలాల గురించి మాట్లాడి సింగూర్ నుండి సాగుకోసం నీటిని విడుదల అయ్యేవిధంగా కృషిచేసినందుకు చిలిపిచెడ్ మండల రైతులపక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలతో అభిషేకం చేయడం జరిగింది. కార్యక్రమంలో చిలిపిచెడ్ సర్పంచి అనిల్, మండలనాయకులు దుర్గరెడ్డి, గోపాల్‌రెడ్డి, సయ్యద్ ఉస్సేన్, వీరస్వామి, సంగగౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చక్రియాల్‌లో అభివృద్ధి పనులు

-పనులకు శ్రీకారం చుట్టిన ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి



సిసి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారంచుడుతున్న చైర్మన్ మల్లారెడ్డి

**చౌటకూరు, మార్చి 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చక్రియాల్‌లో 35లక్షల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి మంగళవారం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో 20లక్షలతో సిమెంట్‌రోడ్లు, 10లక్షలతో గ్రామ సమాఖ్య భవనం, 5లక్షల పంచాయతీనిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజినిర్మాణం ప్రారంభించినట్లు చైర్మన్ మల్లారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి సి.దామోదర్ రాజనర్సింహ సహకారంతో, గ్రామస్థుల అండదండలతో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి నార్సింగ్ ముగులయ్య ముదిరాజ్, కాంగ్రెస్ గ్రామశాఖాధ్యక్షులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, మాజీ ఎంపిటిసిసభ్యులు తుంగె పండరి, డీలర్‌సంఘం మండల అధ్యక్షులు ఉప్పరి దేవదాస్, నాయకులు నీరుడి లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, ఆనందం, మన్నె నర్సింలు, రోళ్లపాటి పండరి పాల్గొన్నారు.

## ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జువేరియాబేగం

**నాగల్‌గిద్ద, మార్చి 24, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయాగ్రామాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉందని, మండల ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పరిధిలోని కరస్‌గుత్తి పిహెచ్‌సి డాక్టర్ జువేరియాబేగం సూచించారు. మార్చి మాసంలోనే ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, ఎండలబారిన పడి డిహైడ్రేషన్‌కు గురయితే అధికంగా నీరు తాగాలని, అత్యవసరంగా బయటకు వెళితే తమవెంట నీళ్ల బాటిల్ ఉండేలా చూసుకోవాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ఎండలో తిరగరాదని డాక్టర్ జువేరియాబేగం సూచించారు.

# అధికారులూ మా గ్రామాల వైపు జర చూడండి

-బిటి కంకర తేలి గుంతలు పడ్డ వైనం
-వాహనదారులకు తిప్పలు
-కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఆయాగ్రామాల రోడ్లు



అంత్వార్ నుంచి అనంతసాగర్ రోడ్డు దుస్థితి దృశ్యం

**నారాయణఖేడ్, మార్చి 24, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోక పోవడంతో వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లపై బిటి కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపై వాహనదారులు, ప్రజలు ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఏకొద్దిపాటివర్షం పడినా సరే ఆ రోడ్లపై నడవాలంటే నరకయాతన తప్పడంలేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. రాత్రిపూట ద్విచక్రవాహనాలు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. పాలకులు అధికారులు స్పందించి మా గ్రామాల్లో రోడ్లను మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. నారాయణఖేడ్ మండలంలోని పలుగ్రామాల్లోని రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. నారాయణఖేడ్ మండలంలోని అంత్వార్ నుండి అనంతసాగర్, జూకల్ పిడబ్ల్యు నుండి మైలార్ వరకు, అటు సత్యగామా, ఇలా అనేక గ్రామాలకు ఇప్పటివరకు రోడ్లు మరమ్మతులు చేయక బిటి రోడ్లు వేయక, ప్రజలు నానా నరకయాతన పడుతున్నారు. అనేక చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పడి కంకర తేలింది. గుంతలతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆయాగ్రామాలనుండి నిత్యం ప్రజలు వస్తువులు కొనుగోలుకోసం, కూలీపనులు చేసుకోవడానికి నారాయణఖేడ్ పట్టణానికి తరచుగా వస్తుంటారు. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలపై రావాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వారు తెలిపారు. ఇప్పటివరకు పలు ప్రమాదాలకుగురైన సంఘటనలు ఉన్నాయి. తేలిన కంకర వాహనాల టైర్లకు గుచ్చుకోవడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వాలు మారినా, రోడ్ల దుస్థితి మాత్రం మారడంలేదని ఆయా గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆయాగ్రామాల్లో అధ్వాన్నంగామారిన రోడ్లకు మరమ్మతులు చేయించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.